క్లుప్తంగా

నేడు వైద్యమిత్రల విధుల బహిష్కరణ

ఆలమూరు: ఎన్టీఆర్ వైద్య సేవలపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సోమవారం విధులు బహిష్కరిస్తున్నట్లు ఆలమూరు సీహెచ్‌సీ వైద్యమిత్రలు ఎస్.రామకృష్ణ, రమణ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవలను భీమా పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోవడం దురదృష్టకరమన్నారు. అలాగే యేళ్ల తరబడి వైద్యమిత్రలకు వేతనాలు పెంచకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాష్ట్ర వైద్యసేవ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపు మేరకు ఈనెలలోని వరుస సోమవారాలు విధులను బహిష్కరిస్తున్నట్లు వైద్యమిత్రలు తెలిపారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం



పాశర్లపూడి వీరభద్రస్వామి సంబరంలో భక్తుల కోలాహలం

మామిడికుదురు: పాశర్లపూడిలోని పొల్లమ్మ ఆలయం సమీపాన ఆదివారం వీరభద్రస్వామి సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. మేళ తాళాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ఉదయం స్వామిని మేలు కొలిపారు. అనంతరం భక్తులు వైనతేయ గోదావరి నది వరకు ఊరేగింపుగా వెళ్లారు. గోదావరి నదీస్నానంతో పాటు పలు పూజలను వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం శమీ పూజతో పాటు భజన నిర్వహించారు. స్వామి వారి భక్తులు 60 గజాల పొడవు కలిగిన నిప్పులగుండం తొక్కారు. కొత్తలంక పుల్లయ్య అవధానుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ



ఆలయ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్త దంపతులు

మామిడికుదురు: బి.దొడ్డవరంలోని బొలిశెట్టివారిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామాలయ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం బ్రహ్మశ్రీ గాడేపల్లి సీతారామశాస్త్రి, గంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, క్షీరాధివాసం, జలాధివాసం, నీరాజన మంత్రపుష్పం, మూలమంత్ర హోమాలు, పంచశయ్యాధివాసం, తదితర కార్యక్రమాలను ఘనంగా జరిపించారు. సోమవారం నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

చక్కటి ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న సత్యనారాయణమూర్తి

రాజోలు: పదో తరగతి విద్యార్థులు చక్కటి ఫలితాలు సాధించాలని విశాఖపట్టణం హెచ్‌బీసీఎల్ డిప్యూటీ సూపరింటెండెంట్ దీపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పొన్నమండ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేశారు. జై భీమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ తాడి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, స్కేల్ తదితర వస్తువులు పంపిణీ చేశారు. అలాగే ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఆచంట సబ్ రిజిస్ట్రార్ కె.వెంకటపతిరాజు ఎంసెట్ ప్రవేశ పరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు రోహిణి, పాఠశాల చైర్మన్ పితాని వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్షల అట్టలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: నరేంద్రపురంలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరీక్షలకు ఉపయోగపడే అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు ఆదివారం పంపిణీ చేశారు. ఇటీవల నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పుష్పగుచ్ఛాలకు బదులుగా విద్యా సామగ్రి తీసుకురావాలని ఎమ్మెల్యే పిలుపునివ్వడంతో పుస్తకాలు, అట్టలు, పెన్నులు వచ్చాయి. వాటిని పేద విద్యార్థులకు అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే వివరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పాఠశాల అధ్యాపక సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైద్యులు కావలెను!



చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



పినపళ్లలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి సాయికిషోర్

- డాక్టర్ల కొరత ఉన్నా డిప్యుటేషన్ ఎలా?
- నిర్వీర్యమవుతున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం
- వైద్యారోగ్య సేవలు అందక రోగుల ఇక్కట్లు

ఆలమూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వైద్య ఆరోగ్యశాఖకు సుస్తీ చేసింది. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు సరఫరాలో చేసే మందులలో కోత విధించగా వైద్యులు కొరతతో గ్రామానికి వెళ్లి ఇంటింటికీ సేవలందించే ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) నిర్వీర్యం దిశగా పయనిస్తుంది. దీంతో గ్రామీణ ప్రాంత రోగులకు సరైన వైద్యసేవలందక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించలేక సతమతమవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోట్లతో నిర్మించిన ఆస్పత్రులు వైద్యులు లేక వెలవెలబోతున్నాయి. ఆలమూరు మండలంలోని రెండు పీహెచ్‌సీ, ఒక సీహెచ్‌సీలు వైద్యుల కొరత ఎదుర్కొంటున్నాయి.

వైద్యుల పోస్టులు భర్తీ చేసేదెప్పుడో..

ఆలమూరులోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఎనిమిది మంది వైద్యులు విధులు నిర్వహించవలసి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. గత ఏడాది సీహెచ్‌సీలో జరిగిన విపత్కర పరిణామాల వల్ల ఇద్దరు వైద్యులు రాజీనామా చేసి వెళ్లిపోవడంతో వైద్యుల కొరత ఐదుకు చేరింది. స్థానిక సీహెచ్‌సీలో వైద్యులు కొరత ఉంటే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ఒక మహిళ వైద్యురాలిని కపిలేశ్వరపురం డిప్యుటేషన్‌పై పంపించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదుగురు వైద్యుల కొరత ఉన్న ఆస్పత్రిలో వేరొక వైద్యురాలికి డిప్యుటేషన్ విధించడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి వైద్యులను నియమించడంతో పాటు డిప్యుటేషన్‌పై వెళ్లిన వారిని వెనక్కి తీసుకురావాలనే డిమాండు అంతటా వ్యక్తమవుతుంది.

రెండు పీహెచ్‌సీల్లోను అదే పరిస్థితి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గత జనవరిలో చడీ చప్పుడు కాకుండా పెదపళ్ల పీహెచ్‌సీలో వైద్యాధికారి పి.భవానీశంకర్‌ను ఏకపక్షంగా బదిలీ చేసింది. అయినా మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ ఆ స్థానం భర్తీ కాకపోవడంతో ఆ ప్రభావం వైద్యసేవలపై పడుతుంది. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి డి.సాయి కిషోర్‌పై పని ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోయింది. ఒకపక్క పీహెచ్‌సీలో రోగులకు చికిత్సను అందిస్తూనే మరో పక్క ఎఫ్‌డీపీకి వెళ్లి గ్రామాల్లో వైద్య సేవలను అందించవలసిన పరిస్థితి నెలకొంది. దీంతో పాటుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బందితో నిర్వహిస్తున్న యాప్‌ల పర్యవేక్షణ చేయించవలసి వస్తుంది. బదిలీ చేసిన వెంటనే భర్తీ చేయాల్సిన వైద్యశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. చొప్పెల్ల పీహెచ్‌సీలో పనిచేసే ఇద్దరు వైద్యాధికారులకు పీజీ విద్య అభ్యసించేందుకు వెళ్లిపోయారు. దీంతో ఆ పీహెచ్‌సీ పరిధిలోని తొమ్మిది గ్రామాలకు వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. రావులపాలెం మండలంలోని ఊబలంక నుంచి ఇన్‌చార్జి వైద్యాధికారిగా శ్రీకాంత్‌ను నియమించినప్పటికి పూర్తి స్థాయిలో సేవలను మాత్రం అందడం లేదు.

ఆలమూరు సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి

వైద్యుల సంఖ్య	08
విధుల్లో ఉన్న వైద్యులు	03
కొరత ఉన్న వైద్యులు	05

పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వైద్యుల సంఖ్య	02
విధుల్లో ఉన్న వైద్యాధికారి	01
కొరత ఉన్న వైద్యులు	01

చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వైద్యాధికారుల సంఖ్య	02
ఖాళీల సంఖ్య	02

ఆరోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది



మండలంలో ఆరోగ్య సేవల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. మండలంలో మూడు ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను సత్వరమే భర్తీ చేయాలి. వైద్యాధికారులను నియమించకుండా ఇప్పటి వరకూ విధులు నిర్వహించిన వారిని ఏ విధంగా బదిలీ చేశారో ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలి.

– తోరాటి లక్ష్మణరావు, ఎంపీపీ, ఆలమూరు

గైనకాలజిస్టును నియమించాలి



మండలంలోని మూడు ఆస్పత్రుల్లో ఎనిమిది వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గైనకాలజిస్టు కొరత అధికంగా ఉండటంతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ప్రయాస పడుతున్నారు. పెదపళ్లలో వైద్యాధికారి పోస్టును భర్తీ చేయకుండా ఏకపక్షంగా బదిలీ చేయడం సరికాదు.

– యేడిద సత్యశ్రీ, సర్పంచ్, పెదపళ్ల, ఆలమూరు మండలం.

సర్పంచ్‌కు నారీరత్న అవార్డు



విజయవాడలో అవార్డు అందుకున్న సర్పంచ్ త్రివేణి

సఖినేటిపల్లి: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఉమెన్స్ ఫర్ ఎక్సలెన్సీ నారీరత్న అవార్డును మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి అందుకున్నారు. ఆయా రంగాల్లో విశిష్ట సేవలందించిన ఆదివారం శ్రీశ్రీ కళావేదిక విజయవాడలో ఈ అవార్డు అందించింది. కార్యక్రమంలో విజయవాడ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ లతామాధురి, సభ్యుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక సభ్యులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యంతోనే సాధికారత

మలికిపురం: స్త్రీ, పురుష సమానత్వం గురించి హక్కులు, ఆదేశిక సూత్రాలు రాజ్యాంగంలో ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కరువైందని, స్త్రీలు చైతన్యవంతమై హక్కుల అమలు కోసం ఉద్యమించాలని ముఖ్య వక్త మానవ హక్కుల కార్యకర్త, అసోసియేట్ ప్రొఫెసర్ కె.వల్లి అన్నారు. ఆదివారం అంబేద్కర్ సామాజిక భవనంలో మహిళా దినోత్సవ సందర్భంగా' బహుజన సమాజ్ పార్టీ, మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మహిళా సదస్సు 'మాజీ సర్పంచ్ చింతా వెంకటరమణి అధ్యక్షతన జరిగింది. రాజకీయంగా, సామాజికంగా మహిళలు ఎప్పుడు అభివృద్ధి చెందుతారో, అప్పుడే నిజమైన సాధికారత ఏర్పడుతుందని ఆమె అన్నారు. మహిళా పారిశుద్య కార్మికులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మలికిపురం జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, రిటైర్డ్ టీచర్ శెట్టిబత్తుల ఎలిజబెత్ రాణి, సామాజిక కార్యకర్త బోనం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా వీరబ్రహ్మం



గుత్తుల వీరబ్రహ్మం

ఆలమూరు: గ్రామానికి చెందిన గుత్తుల వీరబ్రహ్మం రాష్ట్ర ఓబీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లాలోని అన్నవరం రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి ఓబీసీ ఉద్యోగుల సంఘ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు ఎస్పీఆర్ విఠల్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించగా సహచర సభ్యులందరూ వీరబ్రహ్మంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ సంఘ అధ్యక్షుడిగా పనిచేసిన వీరబ్రహ్మంను రాష్ట్ర స్థాయి అధ్యక్షుడిగా ఎన్నుకోవడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రాష్ట్ర మహిళ అధ్యక్షురాలిగా హేమలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులకు ఘన సత్కారం జరిగింది. చొల్లంగి శ్రీధర్, అనకాపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్పవృక్ష, సర్వభూపాల వాహనోత్సవాలు



రావులపాలెంలో స్వామిని కల్పవృక్ష వాహనంపై ఊరేగిస్తున్న గోవిందమాలధారులు



ఆత్రేయపురంలో స్వామికి శ్రీచక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

రావులపాలెం: శ్రీ అలివేలు మంగా పద్మావతి అండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 16వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం హనుమత్ హోమం వైభవంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని కల్పవృక్ష వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథాచార్యుల ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. రాత్రికి స్వామికి సర్వభూపాల వాహనోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కొత్తపేట: మండల కేంద్రం ఆత్రేయపురంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామికి సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మహాశాంతి హోమం, పూర్ణాహుతి తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి శ్రీపుష్పయాగం, ఏకాంత సేవాదర్శనం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఐదు రోజుల పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవెంకట సత్యరాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆలయ నిర్మాత పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణరాజు) ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది గోరింట వినయ్‌వర్మ, పాకలపాటి వెంకట్రాజు, ఆలయ అర్చకులు భక్తులకు ఏర్పాట్లు నిర్వహించారు.

పెద్దింట్లమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



మెండుపాలెంలో పెద్దింట్లమ్మ అమ్మవారి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పిల్లాపాపలతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, అంతర్వేది ఆలయ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది భక్తుల క్యూ పర్యవేక్షించారు. క్యూలో అమ్మవారి దర్శనంలో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖలు ఏర్పాట్లను చూశారు.

మోరిలో..

సఖినేటిపల్లి: మోరిలో కొలువైన మహాలక్ష్మమ్మ, కనక మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు ఆదివారం భక్తులు చలిమిడి, పానకాలు నివేదన చేశారు. అమ్మవార్ల జాతర, తీర్థ మహోత్సవాలు ప్రారంభం రోజున ఏటా ఈ విశేష కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అర్చకుడు వాడపల్లి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. మహాలక్ష్మమ్మ అమ్మవారికి లింగోలు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు చలిమిడి, పానకాలు నివేదన చేశారు. అలాగే కనక మహాలక్ష్మమ్మకు బొల్లాప్రగడ వెంకటరత్నం కుటుంబ సభ్యులు చలిమిడి, పానకం నివేదించారు.

నేటి నుంచి సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాలు



ఉభయ దేవేరులతో కొలువుదీరిన సత్యనారాయణస్వామి

మామిడికుదురు: మాకనపాలెంలో కొలువుదీరిన అనంతలక్ష్మీ, భూదేవి సమేత సత్యనారాయణ స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాల వెలుగులతో ఆలయాన్ని దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. 14వ తేదీ శుక్రవారం వరకు స్వామి వారి కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ ఆదివారం తెలిపింది. ఏకాదశి సోమవారం ఉదయం వ్రతాలు, మొక్కులు, అభిషేకాలతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఈ ఉత్సవాలు శుక్రవారం వరకు అయిదు రోజుల పాటు జరుగుతాయని కమిటీ పేర్కొంది. సోమవారం రాత్రి 12 గంటలకు గరుడ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం, అనంతరం శ్రీస్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణం జరుగుతుందన్నారు. ఉత్సవాలు జరిగే అయిదు రోజులు ఉదయం వ్రతాలు, మొక్కులు, అభిషేకాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు జరిగే అయిదు రోజులు వరుసగా గరుడ, ఆంజనేయపుష్పక, గంధర్వాశ్వ, సర్ప, పొన్న వాహనాలపై స్వామి వారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మద్యం షాపు తొలగించాలి



ఎక్సైజ్ సీఐ కాత్యాయనికి వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తపేట: స్థానిక బోడిపాలెం వంతెన సెంటర్‌లో పలు హిందూ దేవాలయాల సమీపాన నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం షాపును అక్కడి నుంచి తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ద్వారా కల్లు గీత కార్మికుల పేరుతో కొత్తగా మద్యం షాపుల్లో భాగంగా కొత్తపేట మండలానికి సంబంధించి కేటాయించిన ఒక షాపును ఆదివారం స్థానిక బోడిపాలెం వంతెన సమీపంలో ఏర్పాటు చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, మండల శాఖ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు తెలిపారు. ఈ షాపునకు సమీపానే కనకదుర్గాదేవి, ఆంజనేయస్వామి, అయ్యప్పస్వామి, వారాహిమాత మందిరాలు ఉన్నాయని వారు తెలిపారు. ప్రతీరోజు అత్యధిక సంఖ్యలో భక్తులు ఆయా ఆలయాలను సందర్శిస్తుంటారని, అటువంటి ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం భక్తులకు, ముఖ్యంగా మహిళలకు, స్థానికులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈషాపును తొలగించి, వేరే ప్రదేశానికి మార్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయనికి వినతిపత్రం సమర్పించారు.

రబీకి నీటి ఎద్దడి రాకుండా చర్యలు



కొమరాడలో జరిగిన సమావేశంలో పాల్గొన్న చైర్మన్ కృష్ణమోహన్

మామిడికుదురు: రబీ పంటకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటామని తాటిపాక నీటి సంఘం అధ్యక్షులు కడలి కృష్ణమోహన్ తెలిపారు. కొమరాడలో ఆదివారం నీటి సంఘం సమావేశం జరిగింది. పంట కాలువల పరిధిలో సాగునీటి సమస్య రాకుండా డైరెక్టర్లు బాధ్యత తీసుకోవాలని కృష్ణమోహన్ సూచించారు. రైతులతో ఎప్పటికప్పుడు మమేకమవుతూ సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు రైతులకు ఏ విధమైన సమస్యలు ఉన్న వాటిని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రబీ సీజన్ ముగిసిన వెంటనే పంట కాలువల్లో పూడిక తొలగించి, అవసరమైన ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, వంతెనలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో పాటు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు అప్పారి వెంకటేశ్వరరావు, నేదూరి శ్రీనివాసరావు, చేగొండి పద్మావతి, జక్కంపూడి సూర్యప్రకాష్‌రావు, పులఖండం సీత, ఆకుల మల్లేశ్వరరావు, విత్తనాల త్రిమూర్తులు, అనుసూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

960 మందికి ఉచిత వైద్య సేవలు



మామిడికుదురులో నిర్వహిస్తున్న ఉచిత రక్త పరీక్షలు

మామిడికుదురు: భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మల్టీ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 960 మందికి ఉచితంగా వైద్య సేవలందించారు. సత్యసాయి మొబైల్ వ్యాను ద్వారా 350 మందికి ఈసీజీ, ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేశారు. 92 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. 10 మందికి కంటి శుక్లాలు ఆపరేషన్ల కోసం గుర్తించారు. స్కూల్ పూర్వ విద్యార్థి కడలి గోపాలకృష్ణ, భారతి దంపతులు ప్రశాంతి పతాకాన్ని ఆవిష్కరించి, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. గుండె వైద్య నిపుణులు అభిషేక్ వర్మ, గురుకిరణ్, బి.రాఘవేంద్రరావుతో పాటు పలు విభాగాలకు చెందిన నిపుణులు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సుమారు 25 విభాగాలకు చెందిన నిపుణులు ఉచితంగా వైద్య సేవలందించారు. సుమారు రూ.70 వేలు విలువైన మందులను ఉచితంగా అందజేశారు. శిబిరంలో పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో అమలాపురం జోన్ కన్వీనర్ జి.ప్రభాకర్, కాశిన ప్రభాకర్, పర్వత వర్ధనరావు, నెక్కంటి లక్ష్మి, లక్కింశెట్టి నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విజేతలకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేస్తున్న శ్రీనివాస్ తదితరులు

కొత్తపేట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని రిటైర్డ్ పీఈటీ, సత్యసాయి సేవా సమితి సభ్యుడు మారిశెట్టి సత్యనారాయణ, యోగా ఉపాధ్యాయుడు గోటేటి గంగాధరరావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో ఆదివారం స్వామి వివేకానంద యోగాశ్రమం నిర్వాహకుడు, యోగా గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సుమారు 100 మంది యోగా స్టూడెంట్స్ పాల్గొన్నారు. వివిధ యోగాసనాల్లో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసి సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మారిశెట్టి సత్యనారాయణ, గోటేటి గంగాధరరావు, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు నల్లా గోపీ, పుత్సా కృష్ణకామేశ్వర్, సూరవరపు సత్యనారాయణమూర్తి వ్యవహరించారు.

సమాజ సేవలో రోటరీ ముందంజ



సమావేశంలో రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావును సన్మానించిన రొటేరియన్లు

మలికిపురం: సమాజ సేవలో రోటరీ ముందంజలో ఉందని రోటరీ క్లబ్ 3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మలికిపురం రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అధికార పర్యటన సందర్భంగా ఆదివారం మలికిపురం గుబ్బల బాబ్జి ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయంగా రోటరీ సంస్థ చేస్తున్న సేవలను ఆయన వివరించారు. ప్రపంచంలో 12 లక్షల సభ్యులు కలిగిన 44 వేల క్లబ్బులు 260 దేశాలలో ఉన్న రోటరీ అంతర్జాతీయ సంస్థ పోలియో నిర్మూలనకు మిలియన్ డాలర్లు వెచ్చించిందని, సమాజంలో సేవలు తన వంతు నిర్విరామంగా చేస్తున్న అంతర్జాతీయ రోటరీ సంస్థ దాంట్లో ఉన్న సభ్యులు సేవాభావం కలిగి ఉన్నాన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఎం.శ్రీనివాసరావు, రోటరీ కార్యదర్శి మట్టా రవికుమార్, కోశాధికారి తోలేటి సతీష్, రోటరీ సభ్యులు గుబ్బల బాబ్జి, నల్లి శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని ఆయన వివరించారు. కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'కర్రసాము'లో అబ్బులు ప్రతిభ



బహుమతి అందుకుంటున్న అబ్బులు

ఆలమూరు: రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో మండలంలోని కలవచర్లకు చెందిన వీఆర్‌ఓ తాతపూడి అబ్బులు చక్కని ప్రతిభ కనబర్చారు. గుంటూరు జిల్లాలోని ఏసీఎంఈ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో వీఆర్‌ఓ అబ్బులు పాల్గొని ప్రథమ స్థానం సాధించాడు. రాష్ట్ర క్రీడల సంఘ అధ్యక్షుడు సి.ఆదినారాయణ, కార్యదర్శి డి.అశోక్‌బాబు, ఆర్గనైజర్ డీఎస్‌సీ కృష్టోఫర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. అవార్డు గ్రహీత అబ్బులును పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందించారు.